www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 239 | శుక్రవారం | 14 ఫిబ్రవరి, 2025



## 19న బీఆర్ఎస్ విస్తృతస్థాయి మీటింగ్


- కేసీఆర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు
- ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే అవకాశం
- త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక

02

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం
- గందరగోళం మధ్య సభ వాయిదా

02



### పార్లమెంట్ ముందుకు కొత్త ఐటీ చట్టం

నిరసలన మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

02


## తీర్పులు, భేటీలకు సంబంధం ఉండదు



- వ్యవస్థల ఆధారంగానే పనితీరు ఉంటుంది
- తీర్పుల్లో రాజకీయ జోక్యాలపై మాజీ సీజేఐ ఖండన

04

"సుప్రీంకోర్టు తీర్పుల విషయంలో రాజకీయ జోక్యం ఉంటుందన్న ఆరోపణలను మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్రంగా ఖండించారు. చట్ట ప్రకారమే రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు బెయిల్ ఇచ్చామని, గతేడాది 21,300 బెయిల్ పిటిషన్లు కొట్టేశామని గుర్తుచేశారు. మెజార్టీ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఉంటాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు.



## చిలుకూరు పూజారిపై దాడికేసు

పోలీసుల అదుపులో మరో ఏడుగురు

02



# సాంకేతిక రంగంలో సత్తాచాటాలి

- మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించడం గర్వంగా ఉంది
- మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని అవకాశాలు
- సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** యువత సాంకేతికరంగంలో తమ సత్తా చాటాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి అని చెప్పారు. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు.

మిగతా 2 లో

## బీసీ రిజర్వేషన్లపై చేతులు దులుపుకుంటే కుదరదు

04



## పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు

- విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచన
- మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ ప్రీఫైనల్
- మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పబ్లిక్ పరీక్షలు

02

## ఢిల్లీలో అత్యాధునికంగా కేశవ్ కుంజ్

- ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సిద్ధం
- త్వరలోనే ప్రారంభానికి సన్నాహాలు
- 19 నుంచి కార్యకలాపాలు

04




## అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

- రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా తదితరుల స్వాగతం
- ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు
- ఎలన్‌మస్క్‌తోనూ చర్చించే ఛాన్స్
- చారిత్రక బ్లెయిర్ హౌజ్‌లో మోడీకి బస

02



## రైతులకు వేధింపులు

- లోన్ కట్టకపోతే గేటును ఎత్తుకెళ్తారా?
- రుణమాఫీ చేయని సీఎంను మరీ ఏం చేస్తారు..?
- ఎక్స్ వేదికగా బ్యాంకు సిబ్బందిపై కేటీఆర్ మండిపాటు

03



## మాలలతో మాదిగలే తట్టుకోలేదు

- మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారు?
- రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలి
- మహార్, నేతకాని కులాలకు న్యాయం జరిగేలా చూస్తా : మందకృష్ణ మాదిగ

03



## బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తే ఊరుకోం

- మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్

03



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్

**ప్రజానావ, హైదరాబాద్:** సినీ నటుడు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టు పై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో పిటీషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును జస్టిస్ సుదాంశ్ దులియా ధర్మాసనం విచారణ జరిపింది. గత విచారణ సందర్భంగా మోహన్‌బాబుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా జర్నలిస్ట్‌పై జరిగిన దాడికి తాను బహిరంగంగా క్షమాపణ చెప్పానని.. నష్ట పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని మోహన్ బాబు ధర్మాసనానికి చెప్పారు. కాగా జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# 19న బీఆర్ఎస్ సమావేశం

**ప్రజానావ, హైదరాబాద్:** ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాశం జరుగనుంది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలో నే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ, ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు.. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు హాజరవుతారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ రావాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

# వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ:** 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

# పార్లమెంట్ ముందుకు కొత్త ఐటీ చట్టం

**నిరసలన మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్**

**విపక్షాల వాకౌట్...లోక్‌సభ మార్చి 10కి వాయిదా**

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని సమీక్షించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. చట్ట సమీక్షకు 22 ప్రత్యేక సబ్ కమిటీలనూ ఏర్పాటు చేశారు. మొత్తం మీద కొత్త చట్టం సమీక్ష నిమిత్తం 6500 సలహాలను ఆదాయ పన్ను విభాగం అందుకుంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, కొత్త బిల్లు తీసుకొచ్చారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా ఆదాయపు పన్న విషయంలో సరళీకరణ చేపట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా కొట్ట ఐటి చట్టానికి ఇటీవలే కేబినేట్ ఆమోదించింది. దానికి చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంటు ముందుకు తీసుకుని వచ్చారు.



# సాంకేతికరంగంలో సత్తాచాటాలి

- మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించడం గర్వంగా ఉంది
- మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని అవకాశాలు
- సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజానావ,హైదరాబాద్:** యువత సాంకేతికరంగంలో తమ సత్తాను చాటాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి అని చెప్పారు. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని ఉద్ఘాటించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటార్‌షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

- రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా తదితరుల స్వాగతం
- ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు
- ఎలన్‌మస్క్‌తోనూ చర్చించే ఛాన్స్
- చారిత్రక బ్లెయిర్ హౌజ్‌లో మోడీకి బస




**వాషింగ్టన్:** అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు. మోదీ గురువారం తెల్లవారు జామున అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన 2 రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోడీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు. అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్యమున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది. ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

# పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు





- విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచన
- మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ ప్రీఫైనల్...
- మార్చి 21 నుంచి ఏప్రీల్ 4 వరకు పబ్లిక్ పరీక్షలు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పు తీసుకురానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలను నింపడం నుంచి తదితర అంశాలను కొత్తగా చేర్చనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లోనే నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులందరికీ ఓఎంఆర్ పత్రాలను అందించనున్నారు. విద్యార్థులకు అందించే ఈ ఓఎమ్ఆర్ పత్రాల్లో ప్రతి విద్యార్థి తనకు ఇచ్చిన ఆన్సర్ బుక్‌లెట్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. అలాగే దానిపై సంతకం కూడా చేయాలి. విద్యార్థికి సంబంధించిన ఇతర వివరాలు కూడా అందులో ముందుగానే ముద్రించి ఉంటాయి. వాటిని విద్యార్థులు సరిచూసుకోవాలి. వివరాల్లో తప్పులున్నా.. ఆ ఓఎంఆర్ తనది కాకపోయినా.. విద్యార్థులు వెంటనే ఇన్విజిలేటర్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే వారిచ్చే ఇతర నామినల్ రోల్ పత్రంలో సరైన వివరాలను రాయాల్సి ఉంటుంది. ఇక ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో ప్రతిరోజూ ఓఎంఆర్ పత్రాలను విద్యార్థులకు అందిస్తారు. నేరుగా పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రాలను ఇవ్వడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల కొందరు విద్యార్థులు తప్పులు చేసే అవకాశం ఉంది. మరికొందరికి సమయం వృథా అయ్యే ఛాన్స్ ఉంది. దీన్ని నివారించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కొంత సాధన అవుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. అలాగే గత ఏడాది వరకు 4 పేజీల మెయిన్ బుక్‌లెట్ తొలుత జారీ చేసి.. అది సరిపోకపోతే అదనపు షీట్లను ఇచ్చేవారు. దీంతో అదనపు షీట్ల సంఖ్యను కూడా ఓఎంఆర్ పత్రంపై రాసేవారు. అయితే ఈసారి మాత్రం ఇంటర్మీడియట్ తరహాలో 24 పేజీల బుక్‌లెట్‌ను పదో తరగతి విద్యార్థులకు కూడా ఇస్తున్నారు. దీనివల్ల బుక్‌లెట్‌పై అదనపు పత్రాల సంఖ్య రాయవల్సిన అవసరం ఉండదు. ఇలాంటి మార్పులన్నింటి దృష్ట్యా ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని విద్యాశాఖ భావిస్తుంది.

# పూజారిపై దాడికేసు

**పోలీసుల అదుపులో మరో ఏడుగురు**



**ప్రజానావ, రంగారెడ్డి:** మొయినాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు తూర్పు గోదావరి, భద్రాచలం జిల్లాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. దాడి జరిగిన తర్వాత పరారీలో ఉన్న నిందితులలో గురువారం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం రాఘవరెడ్డి 20మంది అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంటికి వెళ్లి దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన తర్వాత ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరికొంత మందిని అరెస్టు చేశారు. దీంతో మిగతా నిందితులు అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు పోలీసులు. రామ రాజ్య స్థాపనకు మద్ధతు ఇవ్వాలని రాఘవరెడ్డి 20 మంది అనుచరులతో అర్చకులు రంగరాజన్ పై దాడి చేశారు. అడ్డొచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడి చేశారు రాఘవరెడ్డి బ్యాచ్. దీనిపై చిలుకూరు బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కీలక నిందితులను అరెస్టు చేశారు. మిగత నిందితుల కోసం గాలిస్తున్నారు.

# పోలీసు కస్టడీకి మస్తాన్ సాయి

**ప్రజానావ, హైదరాబాద్:** నటుడు రాజ్ తరుణ్ - లావణ్య కేసులో కీలక నిందితుడు మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని కోర్టు అనుమతించడంతో గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు రాబట్టేందుకు నార్సింగి పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నేరం, లైంగిక డాడీ, బ్లాక్ మెయిలింగ్ వంటి దురాగతాల కేసులో యూట్యూబర్ మస్తాన్ సాయి పై పలు అభియోగాలు ఉన్నాయి. రాజేంద్రనగర్ కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వడంతో కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి దగ్గర 300 మంది అమ్మాయిల వీడియోలు ఉన్నాయని, అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని లావణ్య ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# జాబితాలో ముస్లింలను చేరిస్తే ఊరుకోం

- మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం
- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్



**ప్రజానావ, హైదరాబాద్:** మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. బిసి జాబితాలో ముస్లింలను చేరిస్తే ఆమోదించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర్ఖత్వమని విమర్శించారు. బిసి రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ కు లేదనేది తేట తెల్లమైందన్నారు. బిసిల్లో ముస్లింలను చేర్చడం వల్ల బిసిలకు రిజర్వేషన్లు తగ్గుతాయని చెప్పారు. బిసిలకు కాంగ్రెస్ మరింత అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బిసి జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం కాంగ్రెస్ కు లేదని దుయ్యబట్టారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్థిక సంఘం నిధులు రావని, నిధులు రావని తెలిసినా స్థానిక సంస్థల ఎన్నికలను ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ? 'బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తే ఆమోదించే ప్రసక్తే లేదు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర్ఖత్వం. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని తేటతెల్లమైంది. బీసీల్లో ముస్లింలను చేర్చడంవల్ల బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా పోతాయి. కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరింత అన్యాయం చేస్తోంది. ముస్లింలను బీసీల్లో కలిపితే హిందూ సమాజమంతా తిరగబడటం ఖాయం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం తథ్యం. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీ జాబితాలో నుండి ముస్లింలను తొలగించాల్సిందే. ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే' అని అన్నారు. 'ఇచ్చిన మాట తప్పుతూ బీసీలను నిండా ముంచుతున్న పార్టీ కాంగ్రెస్. బీసీలంతా కాంగ్రెస్ మోసాలను గుర్తించాలని కోరుతున్నా. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము కాంగ్రెస్‌కు లేదు. మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే తెలంగాణకు నష్టమని తెలీదా?. 15వ గ్రాంట్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయని తెలిసి కూడా జాప్యం చేస్తారా?. ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు రాలేదు. 73, 74వ రాజ్యాంగ సవరణలను ఉల్లంఘిస్తున్నారు. స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతోంది. మీరు ఆమోదించిన రాజ్యాంగాన్ని మీరే అవమానిస్తారా. రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం కాదు.. రాజ్యాంగాన్ని అమలయ్యేలా చూడాలి. సర్పంచ్ లేకుంటే గ్రామ సభలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జరిగేదెలా?. గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నా పట్టించుకోరా?. ఓడిపోతామనే భయానికే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై చేతులు దులుపుకుంటే కుదరదు



- అసెంబ్లీలో అందుకు అనుగుణంగా బిల్లులు పెట్టాలి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**ప్రజానావ, జనగామ:** మోసాలు చేయడంలో ఆరితేరిన గుణం కాంగ్రెస్ పార్టీదని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అదో దాఖాబాజ్ పార్టీ అని అన్నారు. జనగామ జిల్లా పర్యటనలో బీసీ బిల్లుపై కవిత స్పందించారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదన్నారు. అసెంబ్లీలో ఒక్క బిల్లు కాకుండా.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు తేవాలని.. ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ఈ మేరకు బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తేవాలన్నారు. బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తేను ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయన్నారు.కానీ, జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లే అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లుగా నిర్దిష్టమైన సమాచారం ఉందన్నారు. బీఆర్ఎస్ చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడుతామని ప్రకటించిందని.. ఇదే బీసీలందరి తొలి విజయమన్నారు. మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని.. 15 రోజుల కాకుండా నెల రోజుల పాటు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 60శాతం మంది తమ ఇళ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని.. రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వాని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.



# వర్క్ ఫ్రమ్ కారు

## టెక్కీకి వేయి జరిమానా

## బెంగళూరులో సంచలన కేసు

**బెంగళూరు:** వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటే కారులో డ్రైవ్ చేస్తూ..చేసే పనికాదని బెంగళూరు పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తూనే ఐటీ ఉద్యోగులు కొందరు ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తూ ఉండటం మనం అప్పుడప్పుడు గమనిస్తున్నాం. అలా బెంగళూరుకు చెందిన ఓ మహిళ కూడా ప్రయాణవేళల్లో వర్క్ చేసింది. అయితే ఆ సమయంలో ఆమె కారు నడుపుతూ ల్యాప్‌టాప్‌లో వర్క్ చేయడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. దీనిపై పోలీసులు చర్యలు చేపట్టారు. బెంగళూరులోని ఆర్టీ నగర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ కారు డ్రైవ్ చేస్తూనే ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తుంది. దీన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. అదికాస్తా వైరల్‌గా మారి ట్రాఫిక్ పోలీసుల కంట పడింది. దీంతో ఆమెను ట్రాక్ చేసిన పోలీసులు వెయ్యి రూపాయిలు జరిమానా విధించారు. అంతేకాక.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆ మహిళ వీడియోతో పాటు అదుపులోకి తీసుకున్న ఫొటోను ట్రాఫిక్ డీసీపీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది ఇంటి నుంచి చేసేది. కారు డ్రైవ్ చేస్తూ కాదు' అని రాసుకొచ్చారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. పోలీసుల చర్యకు అభినందనలు తెలుపుతున్నారు. మరోవైపు ఆ మహిళ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ కామెంట్లు పెడుతున్నారు. అలాగే పోలీసులను అభినందిస్తున్నారు.



కరీంనగర్ జిల్లా కేంద్రంలో శంకరపట్నం తాజా మాజీ జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి కుమార్తె వివాహానికి మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ రావు, బీఆర్ఎస్ నాయకులు పాకాల మహిపాల్ రెడ్డి, తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, మాడ్గుల రవీందర్ రెడ్డి, గంప వెంకన్న, గంట మహిపాల్, చింతకింది శ్రీనివాస్ గుప్తా, కనగండ్ల తిరుపతి, లింగాల లక్ష్మణ్, బద్ధం తిరుపతి రెడ్డి, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సిద్ధం వేణు, ఎలా శేఖర్ బాబు, గూడూరి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.
- ప్రజానావ, గన్నేరువరం



# కులగణన సర్వే దేశానికి రోల్ మోడల్

- రీ సర్వే కాదు.. వివరాలు మిస్సయిన వారికి అవకాశం: మంత్రి పొన్నం

**ప్రజానావ, కరీంనగర్:** ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే దేశానికి రోల్ మోడల్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగి ని పంపి1.15కోట్ల కుటుంబాలకు కోటి 12 లక్షల కుటుంబాల్లో సమాచారం స్వచ్ఛందంగా ఇచ్చారని.150 కుటుంబాలకు ఒక గ్రూపింగ్‌గా చేయడం జరిగిందని పేర్కొన్నారు. పది మంది ఎన్యూమరేటర్లకు ఒక పరిశీలకుడిని పెట్టి మండల, రాష్ట్రస్థాయిలో ఈ ప్రక్రియ కొనసాగిందని మంత్రి వివరించారు. పకడ్బందీగా ప్రభుత్వంలోని పెద్దలు అటు సీఎస్ ఇతర ప్లానింగ్ డిపార్ట్మెంట్ అధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఈ ప్రక్రియనంత సజావుగా, ట్రాన్స్‌పరెంట్‌గా జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దాదాపు 3.1 శాతంలో కొంతమంది సమాచారం ఇవ్వలేదని, వారికి కూడా అవకాశం ఇవ్వాలని ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. కొంతమంది బిఆర్ఎస్ నేతలు రీ సర్వే జరుగుతుంది అంటున్నారనీ.. ఇది రీ సర్వే కాదు.. ఎవరైతే సర్వేలో మిస్సయ్యారు సర్వేలో సమాచారం ఇవ్వలేధో వారు సమాచారం ఇవ్వడానికి మరో అవకాశం మాత్రమేనని స్పష్టం చేశారు. 42శాతం స్థానిక సంస్థలు, విద్యా, ఉపాధి అవకాశాల్లో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే సంకల్పంతో చట్టబద్ధత తెచ్చే కార్యాచరణ తీసుకున్నామని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. బీజేపీకి కులగణన జరగడం ఇష్టంలేదని, అది వ్యాపారుల పార్టీ అని విమర్శించారు. కుల సంఘాలు, బీసీ సంఘాలు, మేధావులు, రిటైర్డ్ ఐఏఎస్లు, ప్రొఫెసర్లు నిర్ణయం అమలయ్యేదాకా వెంట ఉండాలని కోరారు. సర్వేలో పాల్గొనని వారంతా సర్వేలో పాల్గొనే విధంగా బీసీ సంఘాలు ప్రేరేపితం చేసే విధంగా చర్యలు ఉండాలన్నరు.

బీజేపీ, బీఆర్ఎస్ బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే శాసనసభలో బిల్లు చేసి చట్టబద్ధత చేసి కేంద్రానికి పంపిస్తామని పేర్కొన్నా రు. తెలంగాణలో 56శాతం బీసీలున్నారని, 46శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టబద్ధత కల్పిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీనియర్ నాయకులు కేశవ రావు , సహచర మంత్రులతో పాటు కాంగ్రె స్ సీనియర్ నేత రాహుల్ గాంధీ , తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ సహకారంతో ప్రభుత్వం ఈ చారిత్రాక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కోమటిరెడ్డి పద్మకర్ రెడ్డి, ఎండీ తాజ్ , వైద్యుల అంజన్ కుమార్, సిరాజు హుస్సేన్, పులి ఆంజనేయులు గౌడ్, గడ్డం విలాస్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, ముత్యం శంకర్, బుచ్చిరెడ్డి, మాచర్ల ప్రసాద్, సరిల్ల ప్రసాద్, అజీమ్ మహమ్మద్, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వేధింపులు

- లోన్ కట్టకపోతే గేటును ఎత్తుకెళ్తారా?
- రుణమాఫీ చేయని సీఎంను మరీ ఏం చేస్తారు..?
- ఎక్స్‌వేదికగా బ్యాంకు సిబ్బందిపై తీరుపై కేటీఆర్ మండిపాటు



**ప్రజానావ, హైదరాబాద్:** రైతులపై బ్యాంకు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సరైందికాదని, కొన్ని సంఘటనలు చూస్తే మనసు చలిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని..కష్టాల్లో ఉన్న పాడి రైతు లోన్ కట్టలేదని.. ఏకంగా ఆ ఇంటికి ఉన్న గేటును బ్యాంక్ సిబ్బంది ఎత్తుకెళ్లారని.. మరి రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని.. మాటతప్పిన ముఖ్యమంత్రిపై చర్య తీసుకునే ధైర్యముందా అని ప్రశ్నించారు. రుణం తీర్చలేదని రైతుపై చూపిన ప్రతాపాన్ని.. రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డిపై చూపించగలరా.. అని అన్నారు. పేద రైతు కు ఒక న్యాయం.. పదవిలో ఉన్న వారికి మరో న్యాయమా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకోవాలని, రైతులు అంతా గమనిస్తున్నారని.. ఇలాంటి ఘోరాలను చూస్తూ ఊరుకోరని.. కాంగ్రెస్ నేతల్ని ఇంటి గేటు కూడా తొక్కనియ్యరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా బ్యాంకులో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులలో తండా మంజుల, మద్దెబోయిన ప్రేమలతలకు పాడిగేదెల కోసం జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉన్న డీసీసీబీ రూ.8.72 లక్షల రుణం 2021 అక్టోబరులో ఇచ్చింది. ఒక్కో గ్రూపునకు ఐదుగురు చొప్పున రెండు గ్రూపుల్లో మొత్తం 10మంది తలా ఒక పాడిగేదె కొన్నారు. అయితే కొంత అప్పు కట్టినా రెండు గ్రూపులు కలిపి మొత్తం రూ.7 లక్షల బాకీ చెల్లించలేదు. వాస్తవానికి 2023లోనే ఈ రుణ వాయిదాలు పూర్తి కావాల్సి ఉంది. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు 2023 అక్టోబరులో లీగల్ నోటీసులు పంపారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం లబ్ధిదారుల ఇంటికి బ్యాంకు సిబ్బంది లీగల్ నోటీసులు ఇవ్వడానికి వె ళ్లారు. ఈ సందర్భంగా గట్టిగా అడగడంతో రూ.3 లక్షలు చెల్లించారు. అయితే రెండు రోజుల్లో మొత్తం చెల్లిస్తామన్నా వినకుండా బ్యాంకు సిబ్బంది తమ ఇంటి గేట్లు తీసుకెళ్లారని మద్దెబోయిన ప్రేమలత ఆరోపించారు. అయితే వారే తమ గేట్లు తీసుకెళ్లమన్నారని డీసీసీబీ కొడకండ్ల బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి తెలిపారు.

# మాలలతో మాదిగలే తట్టుకోలేదు

- మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారు?
- రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలి
- మహార్, నేతకాని కులాలకు న్యాయం జరిగేలా చూస్తా : మందకృష్ణ మాదిగ



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గమే మాలలతో తట్టుకోలేకపోయిందని, వర్గీకరణ గ్రూపు-3లో ఉన్న మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ వర్గీకరణ సరైందని, రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలని చెప్పారన్నారు. జాతీయ మహార్ నేతకాని ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక నాయకులు నారాయణ దుర్గే మహార్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహార్, నేతకానిలకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి రిజర్వేషన్ కేటాయించాలనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మందకృష్ణ మాదిగ, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ బోర్లకుంట వెంకటేష్ నేత ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మహార్, నేతకాని కులాలకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు. దళితుల జీవితాలను బాగు చేసిన అంబేడ్కర్ మహార్ జాతికి చెందిన వారేనన్నారు. దళితులలో 59 కులాలకు దక్కాల్సిన వాటాను ఒక్క మాల కులమే ఇప్పటి వరకు అనుభవించిందని ఆరోపించారు. సర్టిఫికెట్‌ల కోసం మహార్, నేతకానిలు తమ అస్థిత్వం కోల్పోవద్దని, తహసీల్దార్‌ల ద్వారా కుల సర్టిఫికెట్ సాధించుకోవాలని సూచించారు.

# పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు

## 4 రోజుల్లో తమ ముందు హాజరుకావాలని మొయినాబాద్ పోలీసుల వెల్లడి



**ప్రజానావ, హైదరాబాద్:** కోడిపందేల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి మొయినాబాద్ పోలీసులు గురువారం నోటీసులు ఇచ్చారు. కోడి పందాలు జరిగిన ల్యాండ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి చెందినదిగా పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. మొయినాబాద్ తోల్కట్ట గ్రామం సర్వే నెంబర్ 165/ఏలో ఈ ఫాంహౌస్ ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల్లో ఆధారాలతో తమ ముందు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరు కావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో పోచంపల్లిని నిందితుడిగా మొయినాబాద్ పోలీసులు చేర్చారు. సెక్షన్ 3 అండ్ 4 గేమింగ్ యాక్ట్ కింద్ కేసు నమోదు చేశారు. సెక్షన్ 11 యానిమల్ యాక్ట్ కింద మరో కేసు నమోదు చేశారు. ఫాంహౌస్‌లో బెట్టింగ్స్ చేస్తూ పందాలు ఆడిస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌస్‌ను సబ్ లీజుకు భూపతి రాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ తీసుకున్నారు. ఫాంహౌస్‌లో భారీ సెటప్‌తో కోడి పందాలను గబ్బర్ నిర్వహించాడు. అయితే కోడిపందాలకు సంబంధించి మరి కొంతమందిని విచారించే అవకాశాలు ఉన్నాయి. కాగా, మూడు రోజుల క్రితం నగర శివారులో భారీ క్యాసినోను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన కలకలం రేపింది. మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌పై దాడి చేసిన రాజేంద్రనగర్ పోలీసులు.. కోళ్ల పందాలతోపాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ ఘటనలో 64 మందిని అరెస్టు చేశారు. రూ.30 లక్షల నగదుతోపాటు 55 కార్లు, 86 కోళ్లు స్వాధీనం పరుచుకున్నారు. పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్ కూడా సీజ్ చేశారు. పట్టుబడినవారిలో ఏపీ, తెలంగాణకు చెందినవారు ఉన్నట్లు సమాచారం. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిసి క్యాసినో, కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# తీర్పులు, భేటీలకు సంబంధం ఉండదు

- వ్యవస్థల ఆధారంగానే పనితీరు ఉంటుంది
- తీర్పుల్లో రాజకీయ జోక్యాలపై మాజీ సీజేఐ ఖండన



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు తీర్పుల విషయంలో రాజకీయ జోక్యం ఉంటుందన్న ఆరోపణలను మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్రంగా ఖండించారు. చట్ట ప్రకారమే రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు బెయిల్ ఇచ్చామని, గతేడాది 21,300 బెయిల్ పిటిషన్లు కొట్టేశామని గుర్తుచేశారు. మెజార్టీ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఉంటాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. గణపతి పూజ సందర్భంగా తమ ఇంటికి ప్రధాని మోదీ రావడంపై మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ మరోసారి స్పందించారు. భారత న్యాయ వ్యవస్థపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. బీబీసీ నిర్వహించే హార్డ్ టాక్ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి స్టీఫెన్ సకూర్ అడిగిన పలు ప్రశ్నలకు జస్టిస్ డీవై చంద్రచూడ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. అందులో ఆర్టికల్ 370 రద్దు నుంచి ఆయన ఇంట గణేష్ చతుర్థి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం వరకు అడిగిన అన్ని ప్రశ్నలకు జస్టిస్ చంద్రచూడ్ చాలా హుందాగా సమాధానమిచ్చారు. ప్రధాని మీకు బాగా సన్నిహితమా అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తమ వ్యవస్థ పరిణతితో వ్యవహరిస్తుందని బదులిచ్చారు. రాజ్యాంగపరంగా ఉన్నత పదవుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య మర్యాదపూర్వక భేటీని అతిగా చూడొద్దని సలహా ఇచ్చారు.. కేసుల తీర్పునకు ఇలాంటి మర్యాదలకు మధ్య సంబంధం లేదని అర్థం చేసుకొనే పరిణతి మా వ్యవస్థలో ఉందని మాజీ సీజేఐ వెల్లడించారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయాన్ని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని సమర్థించు కున్నారు. రాజ్యాంగం అసలు ఉద్దేశానికి అనుగుణంగా ఆ తీర్పు ఉందన్నారు. ఈసందర్భంగా కశ్మీర్ ఎన్నికల అంశాన్ని ఉదహరించారు. 'జమ్మూకశ్మీర్‌కు సెప్టెంబరు 30, 2024లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించింది. ఇప్పుడు అక్కడ ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకొన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికార మార్పిడి కూడా శాంతియుతంగా జరిగిందని అంటూ సమాధానమిచ్చారు. ఇదిలాఉంటే, జస్టిస్ డీవై చంద్రచూడ్ సీజేఐగా ఉన్న సమయంలో ఆయన నివాసంలో నిర్వహించిన గణపతి పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర సంప్రదాయ టోపీ ధరించి పూజలో పాల్గొన్న ఫొటోలను ప్రధాని సామాజిక మాధ్యమ ఖాతాలో అప్పట్లో పోస్ట్ చేయడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై గతంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. ప్రధానమంత్రి రావడంలో తప్పులేదన్న ఆయన.. అది బహిరంగ భేటీయేనని, వ్యక్తిగత సమావేశం కాదన్నారు. అధికార విభజన అంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమావేశం కావద్దని, చర్చించవద్దని అర్థం కాదన్నారు. భారత న్యాయవ్యవస్థ.. ఉన్నత వర్గాలు, హిందూ అగ్రవర్ణ పురుషుల ఆధిప్యంలో ఉందా.. అని స్టీఫెన్ సకూర్ ప్రశ్నకు జస్టిస్ చంద్రచూడ్ ఏకీభవించలేదు. దేశ న్యాయ వ్యవస్థకు మూలాధారమైన జిల్లా న్యాయ వ్యవస్థను ఓ సారి పరిశీలిస్తే.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేరే వారిలో 50 శాతానికి పైగా మహిళలు ఉన్నారన్నారు. అంతేకాదు.. దేశంలో 60 నుంచి 70 శాతం మేర.. మహిళలు చేరుతోన్నారని ఆయన వివరించారు. దేశంలో మహిళలకు సైతం న్యాయ విద్య చేరువైందని చెప్పారు. జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థలో మహిళ సంఖ్య పెరుగుతోందన్నారు. అలాగే మహిళలు సైతంపైకి ఎదుగుతోన్నారని తెలిపారు. అదీకాక తన తండ్రి వైవీ చంద్రచూడ్.. తాను భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నంత కాలం న్యాయస్థానంలో అడుగు పెట్ట వద్దని తనతో చెప్పే వారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే తాను హార్వర్డ్ లా స్కూల్‌లో మూడు సంవత్సరాలు చదువుకొన్నానని తెలిపారు. అలా తన తండ్రి పదవీ విరమణ చేసిన అనంతరం తొలిసారిగా తాను కోర్టులో ప్రవేశించానని వివరించారు. దేశ న్యాయ వ్యవస్థను ఓ సారి పరిశీలిస్తే.. చాలా మంది న్యాయవాదులు, న్యాయమూర్తులు.. ఈ వృత్తిలోని తొలిసారి ప్రవేశించిన వారేరన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా మీరేమైనా రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కోవలసి వచ్చిందా? అంటూ అధికార బీజేపీ తన సొంత రక్షణ కోసం కోర్టుపై మొగ్గు చూపిందంటూ న్యూయార్క్ టైమ్స్ సంపాదకీయాన్ని బీబీసీ ప్రతినిధి సకూర్ ప్రశ్నించగా.. డీవై చంద్రచూడ్ సమాధాన మిస్తూ.. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో.. భారత్‌లో ఏకపక్షంగా ఉంటాయనే అపోహను తొలగించాయని చెప్పారు. ఆ క్రమంలో దేశంలోని రాష్ట్రాలను పరిశీలిస్తే.. చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. అవి ఈ ఎన్నికల్లో ప్రభావం చూపాయి. అవి రాష్ట్రాలను సైతం పాలిస్తున్నాయని సోదాహరణగా వివరించారు. పరువు నష్టం కేసులో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి శిక్ష విధించడంపై ప్రశ్నించగా.. సుప్రీంకోర్టు తీర్పును ఆ తర్వాత పాజ్ చేసిందని

# ఢిల్లీలో అత్యాధునికంగా కేశవ్ కుంజ్

- ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సిద్ధం
- త్వరలోనే ప్రారంభానికి సన్నాహాలు
- 19 నుంచి కార్యకలాపాలు




**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలో అత్యాధునికంగా నిర్మించిన ఆర్ఎస్ఎస్ కార్యాలయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా దీనిని పూర్త ఇచేసేందుకు శ్రమిస్తున్నారు. రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' కార్యాలయ పనులు దాదాపు పూర్తికావడంతో కార్యకలాపాలను తిరిగి అక్కడకు మార్చారు. 3.75 ఎకరాల స్థలంలో ఉన్న పాత రెండంతస్తుల కార్యాలయం 'కేశవ్ కుంజ్' స్థానంలో అయిదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో దీనిని నిర్మించారు. ఒక్కొక్కటి 13 అంతస్తుల్లో మూడు బ్లాకులు, 300 గదులు, కార్యాలయాలు, అధునాతన సమావేశ మందిరాలు దీనిలో ఉంటాయి. కరోనా అవాంతరాల వల్ల పనులు నిలిచిపోవడంతో ఇది పూర్తయ్యేందుకు ఎనిమిదేళ్ల సమయం పట్టింది. నూతన భవనం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న నిర్వహించబోయే కార్యకర్తల సమ్మేళనానికి సంఘ్ అగ్రనేతలు మోహన్ భాగవత్, దత్తాత్రేయ హొళసబలె హాజరవుతారు. గుజరాత్ ఆర్కిటెక్ట్ అనూప్ దేవ్ సారథ్యంలో రూపొందించిన ఈ అద్భుతమైన భవనం పేరు 'కేశవ్‌కుంజ్'. కొత్తగా నిర్మించిన ఈ భవనంలో అత్యాధునిక సదుపాయాలు, ఆకర్షణీయంగా నిర్మించిన మూడు 13 అంతస్తుల భవనంలో ఫిబ్రవరి 19 నుంచి పార్టీ కార్యకలాపాలు మొదలుకానున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కొత్త హెడ్ క్వార్టర్స్ పేరు 'కేశవ్ కుంజ్'. మూడు హై రైజ్ టవర్లకు సాధన, ప్రేరణ, అర్చన అని పేరు పెట్టారు. 13 అంతస్థులున్న ఈ బిల్డింగుల్లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 300లకు పైగా గదులున్నాయి. దాదాపు 8 ఏళ్ల నిర్మాణం అనంతరం మళ్లీ ఆర్ఎస్ఎస్ ఇందులోకి ప్రవేశించింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగత్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కార్య సేవకుల సమావేశం అందులో జరగబోతోంది.

ఆఫీస్ కార్యకలాపాలకు సాధన బిల్డింగ్,10 వ అంతస్తులో 8,500 పుస్తకాలతో లైబ్రరీ. ప్రేరణ టవర్ లో మొదటి అంతస్తులో హనుమాన్ టెంపుల్ ఉండగా అర్చన టవర్ కార్యసేవకులకు ఉద్దేశించింది. కొత్త భవనంలో 3 పెద్ద ఆడిటోరియాలు ఏర్పాటుచేశారు. అందులో ఒకటి విశ్వ హిందూ పరిషత్ నాయకుడు అశోక్ శింఘాల్ పేరిట 450 సీట్లతో నెలకొల్పగా.. 650 సీట్లు, 250 సీట్లతో మరో రెండు ఆడిటోరియం లను నిర్మించారు. ఎకో ఫ్రెండ్లీ బిల్డింగ్‌లో సోలార్ విద్యుత్, వుడ్ బదులు గ్రానైట్ ఫ్రేంస్ ఏర్పాటు చేశారు. ప్రేరణ, అర్చన టవర్ల మధ్య ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెగ్డెవార్ విగ్రహం నెలకొల్పారు. బీజేపీ సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్ హెడ్ క్వార్టర్స్ 1939 లో నాగ్‌పూర్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించింది. 1961లో దేశరాజధాని ఢిల్లీలోని చిన్న ఇంటికి మార్చింది. 1969, 1980లో ఒకటి, రెండు అస్తులను నిర్మించుకొని అందులోనే కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చింది. మారిన అవసరాలు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దాదాపు 4 ఎకరాల విస్తీర్ణంలో కొత్త భవనం నిర్మాణానికి 2018 లో మోహన్ భగత్ శంకుస్థాపన చేశారు. కేశవ్ కుంజ్ నిర్మాణానికి అయిన ఖర్చు అక్షరాలా రూ.150 కోట్లు. రూ.5 నుంచి మొదలుకుని 75వేల మంది ఈ నిర్మాణం కోసం విరాళాలు అందించారని సమాచారం.




# స్వదేశీ జాగరణ్ మంచ్ కృషి ప్రశంసనీయం

## ప్రజ్ఞాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి గిరిధర్

**ప్రజానావ, కరీంనగర్:** దేశ ఉపాధి రంగంలో గణనీయమైన పరివర్తన చోటు చేసుకుంటుందని, భారత ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్ పథకాల ద్వారా ఉపాధి రేటు గణనీయంగా పెరిగిందని, ఆ దిశలో స్వదేశీ జాగరణ్ మంచ్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజ్ఞాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, సమాలోచన రాష్ట్ర కన్వీనర్, ప్రజ్ఞా ప్రవాహ కేంద్రీయ కార్య సమితి సభ్యులు మామిడి గిరిధర్ అన్నారు. స్వదేశీ మేళా కార్యక్రమంలో భాగంగా గురువారం కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు స్వదేశీ, గ్లోబలైజేషన్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడానికి ప్రారంభించిన మేకిన్ ఇండియా వంటి కార్యక్రమం స్వావలంబి వైపు భారత్‌ను ముందుకు తీసుకెళ్లడంలో, వికసిత్ భారత్ యొక్క దృక్పథాన్ని నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మూడు దశాబ్దాలుగా స్వదేశీ భావనను ప్రచారం చేయడంలో స్వదేశీ జాగరణ మంచ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మార్కెటింగ్ ప్రొఫెషనల్, మీడియా స్ట్రాటజిస్ట్ సురేష్ కొచ్చిటిల్, నేషనల్ లిస్ట్ హబ్ సీఈవో అవునూరి సాయి కృష్ణలు మాట్లాడుతూ పెట్టుబడి , ఆవిష్కరణ, వ్యవస్థాపకతకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా దేశీయ తయారీని రంగాన్ని గణనీయంగా పెంచుకోవచ్చన్నారు. ఆ దిశగా నేటి ప్రభుత్వం ముఖ్యమైన కీలక రంగాలపై దృష్టి సారించిందని, తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఉపాధిని సృష్టించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లాంటి విధానాలతో ముందుకు కొనసాగుతూ, భారతదేశం యొక్క ప్రపంచ పోటీ తత్వాన్ని పెంచడం లక్ష్యంగా ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. స్వయం సమృద్ధి, దిగుమతుల తగ్గింపు, దేశీయ ఉత్పత్తి వృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఆత్మనిర్భర్ భారత్ అవకాశాల అంతరంగాన్ని సృష్టిస్తుందన్నారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్, స్వదేశీ మేళా కన్వీనర్ చెల్మెడ రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా స్థానిక పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో , చేతితో తయారుచేసిన అద్భుతమైన వస్తువులు మొదలుకొని, తాజా సాంకేతిక ఆవిష్కరణల వరకు. విస్తృతమైన స్వదేశీ ఉత్పత్తులను మేళాలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సెమినార్ సభాధ్యక్షులు , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ సీఏ నిరంజనాచారి, వీహెచ్‌పీ ప్రాంత టోలి సభ్యులు ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి మాట్లాడారు. మధ్యాహ్నం జరిగిన మెడికల్, ఫార్మసి, నర్సింగ్ విద్యార్థుల సెమినార్ కార్యక్రమానికి అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు మామిడి గిరిధర్ హాజరై మాట్లాడారు. దేశ వైద్యవృత్తి గొప్పదనాన్ని వివరించారు. అనుసరించాల్సిన విధానాలను, సూచనలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వైద్యులచే సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మానస ఆధ్వర్యంలో చేపట్టారు.

# పెండింగ్ ఆస్తి పన్నులపై ఆరా

## నగరపాలక సంస్థలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సమీక్ష

**ప్రజానావ, కరీంనగర్:** నగరపాలక సంస్థ ఆస్తి పన్నుల టార్గెట్‌ను వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో గురువారం కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఇన్‌చార్జి ఆర్వో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆస్తి పన్నుల వసూళ్ల వివరాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సంబంధించిన పెండింగ్ వివరాలు, మొండి బకాయిదారుల పై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వారిగా పన్నుల బకాయి వివరాలను అడిగి తెలుసుకొని, రెవెన్యూ విభాగం అధికారులకు సూచనలతో కూడిన ఆదేశాలు జారీ చేశారు. నగరపాలక సంస్థకు పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గత కొన్నాళ్లుగా నగరపాలక సంస్థకు ఆస్తి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని ఆర్ఐలను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కు సంబంధించిన ఆస్తి పన్నులపైనా ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తిస్థాయిలో పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోలాప్స్ అయిన భవనాలకు కూడా పెండింగ్ బకాయిలు ఉంటే వాటిని పూర్తి స్థాయిలో కట్టించిన తర్వాతే అలాంటి ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీని ఆదేశించారు. నగరపాలక సంస్థ ద్వారా షెటర్లను పొందిన వ్యాపారులు త్వరగా అగ్రిమెంట్ చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా ఉన్న నగరపాలక సంస్థ షెటర్లలో వ్యాపారం చేసే వ్యాపారులు షెటర్ల బకాయిలను త్వరగా చెల్లించాలని హెచ్చరించారు. దుకాణాల వ్యాపారులకు కూడా నోటీసులు జారీ చేయాలని ఆర్ఐ లను ఆదేశించారు. పెద్ద మొండి బకాయి దారులను ప్రతిరోజూ కలవాలని, టార్గెట్ ప్రకారం పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్వో, రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.



# పారదర్శకంగా ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించాలి





**ప్రజానావ, సిరిసిల్ల:** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని డీపీఓ, నోడల్ అధికారి శేషాద్రి సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీపీఓ, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడారు. ఎన్నికల నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకునిహసజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏహసందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి ఆక్షేపణలు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఆర్ఓ లు 194, మంది ఏ ఆర్ఓలు 75 మంది , ఎంపీడీవోలు, ఎంపీఓలు శిక్షణకు హాజరయ్యారు. గ్రామపంచాయతీ ఎన్నికల కోసం జిల్లాలో మొత్తం 2268 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. శిక్షణ తరగతుల్లో డీపీఎల్ పీఓ నరేష్, మాస్టర్ ట్రెయినర్లు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే పేరుతో ఇంటికొచ్చి పట్టపగలే దోచుకెళ్లారు

## వృద్ధురాలిని కట్టేసి 18 తులాల బంగారం అపహరణ

## ఖమ్మంలో ఘటనల.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**ప్రజానావ, హైదరాబాద్:** ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారా.. అయితే తస్మాత్ జాగ్రత్త.. సర్వే పేరుతో, ఇంకా ఏ ఇతర అవసరాల కోసమే తలుపు కొడితే ఒక్క క్షణం ఆలోచించండి. తలుపు తీశారో.. మీ ఇల్లు గుల్లవుతుంది. ప్రతిఘటిస్తే.. మీ ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. తాజాగా అలాంటి ఘటనే ఖమ్మం జిల్లాలో వెలుగుచూసింది. వైరా మున్సిపాలిటీ సుందరయ్య నగర్‌లో శీలం యుగంధర్ రెడ్డి ఇంటి వద్దకు పట్టపగలే కారులో నలుగురు దుండగులు వచ్చారు.. సర్వేకి వచ్చామంటూ తలుపు కొట్టారు. ఆపై నలుగురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలు వెంకట రావమ్మ (65)ను సర్వే పేరుతో వివరాలు అడుగసాగారు. బయట ఎవరూ లేరని నిర్ధారించుకుని ఒక్కసారిగా దాడి చేసి కాళ్లు, చేతులు కట్టేసి..నోటికి ప్లాస్టర్ వేశారు. అనంతరం చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన 15 లక్షల రూపాయల విలువైన 18 తులాల బంగారు నగలు చోరీ చేసి కారులో పరారయ్యారని బాధితురాలు తెలిపింది. కుమారుడు శీలం యుగంధర్ రెడ్డి ఉద్యోగరీత్యా కొత్తగూడెం వెళ్లాడు. కోడలు ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలని టార్గెట్ చేసిన దొంగలు సర్వే పేరుతో ఇంట్లోకి వచ్చి చోరీకి తెగబడ్డారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన కోడలకు చోరీ సంఘటన తెలుసుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఏసిపి రహమాన్ సిఐ సాగర్ ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించిన దుండగులు.. దొంగల కోసం గాలింపు చేపట్టారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
14 ఫిబ్రవరి 2025


# వచ్చే మహా జాతరకు మాస్టర్ ప్లాన్

- మినీ మేడారం జాతరకు అన్నీ ఏర్పాట్లు చేశాం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు



**ప్రజానావ, ములుగు:** రాష్ట్ర ప్రజలకు వన దేవతలు శ్రీ సమ్మక్క సారలమ్మ దీవెనలు ఆశీర్వాదాలు ఉండాలని మంత్రి వర్యులు సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మినీ మేడారం సందర్భంగా మంత్రి సీతక్క వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాటు చేసిందని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రింకింగ్ వాటర్ మరియు క్యూ లైన్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు జాతర పై దృష్టి పెట్టి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారని, ఈ మినీ మేడారం జాతరకు ఇప్పటికే సుమారు 6 లక్షల మంది భక్తులు తల్లులకు మొక్కులు చెల్లించారని పేర్కొన్నారు. ఇంకా రెండు రోజుల పాటు సాగే తెలంగాణ కుంభమేళ మినీ మేడారం జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, జంపన్న వాగు ఒడ్డున స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మంత్రి వెంట ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్‌తో పాటు పూజారులు, అధికారులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

### వైభవంగా మినీ మేడారం జాతర

ములుగు జిల్లాలోని మేడారంలో మినీ జాతర కొనసాగుతోంది. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు పూజారులు వనదేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక మినీ జాతర ప్రారంభమైన నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మండమెలిగె పండుగ సందర్భంగా తల్లుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### కొనసాగుతున్న మినీ జాతర

మేడారంలో మినీజాతర కొనసాగుతోంది. బుధవారం రాత్రి పూజారులు సమ్మక్క పూజ మందిరం నుంచి పసుపు, కుంకుమ, నైవేద్యం తీసుకొచ్చి సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. తాడ్వాయి మండలం, మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండమెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. డోలు వాయిద్యాలు, కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్లు ఆరబోస్తుండగా వడ్డెలు (పూజారులు) గద్దెల వద్దకు చేరుకొని జాగారం చేశారు. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు పూజారులు వనదేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక మినీ జాతర ప్రారంభమైన నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మండమెలిగె పండుగ సందర్భంగా తల్లుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలిరోజు సుమారు 2.5 లక్షల మంది మేడారం చేరుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.





## జాతరలో వాటర్, కూల్‌డ్రింక్‌ల పంపిణీ



**ప్రజానావ, తాడ్వాయి:** తాడ్వాయి మండలం మినీ మేడారంలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులతో పాటు భక్తులకు బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకుడు భూక్య జంపన్న వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్‌లను అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నార్లాపూర్ సర్పంచ్ సిద్ధబోయిన చిన్నక్క, శివరాజ్, ఉప సర్పంచ్ అజ్మీర రతన్‌సింగ్, రైతు కమిటీ అధ్యక్షుడు నల్లమొక్క లక్ష్మి సమ్మయ్య, సామాన్య కమిటీ సభ్యులు ఎడవల్లి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడారంలో దొంగల హల్‌చల్



**ప్రజానావ, ములుగు:** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరుగుతున్న మేడారం మినీ జాతరలో దొంగలు తమ చేతులకు పనిచెప్పారు. మినీ మేడారం జాతరలో భాగంగా భక్తులు సమ్మక్క తల్లి గద్దెల మీదికి మొక్కులు చెల్లించడానికి వచ్చిన పర్వతగిరి మండలం రోల్కల్ గ్రామానికి చెందిన సొల్తీ పుష్మమ్మ అనే మహిళ మెడలో నుంచి నాలుగు తులాల పుస్తెలతాడును దొంగిలించారు. సమ్మక్క తల్లి గద్దెలపై విధులు నిర్వహిస్తున్న సీసీఎస్ క్రైమ్ బ్రాంచ్ కానిస్టేబుల్ గాలి రాజకుమార్, మధులు అప్రమత్తమై దొంగను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి బంగారాన్ని మహిళకు అందించారు. దొంగను పట్టుకున్న కానిస్టేబుల్ రాజ్ కుమార్, మధులకు మహిళ కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారులు వారిని అభినందించారు.

## రామకృష్ణ సేవ ట్రస్ట్ ఆర్థికసాయం



**ప్రజానావ, మంగపేట:** మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన నిరుపేద గాంధర్ల సమ్మక్క ఇల్లు ఇటీఇల ప్రమాదవశాత్తు కాలిపోగా శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ నాగ రమేశ్ గురువారం వారిని పరామర్శించి 25 కేజీల బియ్యంతో పాటు రూ. 3వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన అనంతుల రవి తల్లి అనంతుల వనమాల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. వలబోజు నరసింమా చారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వా రి కుటుంబ సభ్యుల్ని కలసి దశదిన కర్మలకు 25 కేజీల బియ్యంతో పాటు రూ. 1500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాడిష నవీన్, మునిగెల మహేశ్, మండల సంతోష్ , గ్రామస్తులు యగ్గడి అర్జున్, పూసల నరసింహారావు, జాడి రాంబాబు, జీముడ నాగేశ్, దుర్గం నరసింహా రావు, దీ గొండ బాబు, పూజారి సతీష్, దుర్గం శ్రీను పాల్గొన్నారు.


## అధికారులదే ఇష్టారాజ్యం!



### బీజేపీ అధ్యక్షుడు రావుల జానకి రావు

**ప్రజానావ, మంగపేట:** మండలంలో 14ఏళ్లుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు జరగక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ అధ్యక్షుడు రావుల జానకి రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన కొందరు అధికారులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, కొన్ని గ్రామాల్లో అధికారులు కొందరు గ్రామసభలు నిర్వహించకుండా.. తీర్మానాలు లేకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు. కొందరు అధికారులు జీపీ నిధులను మింగి, సస్పెండ్ ఐన సంఘటనలు వున్నాయని గుర్తుచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని, జీపీ నిధులు దుర్వినియోగం కా కుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోదెం రవీందర్, జిల్లా సీనియర్ నాయకుడు రామిడి సురేశ్ పటేల్, మండల కార్యదర్శి నిడద వోలు శ్రీను, మల్లారెడ్డి, అజ్జు బాయ్, మూతి రవి, మిణుగు తిరుపతి, సునీల్, శివకుమార్, వీర్ల మధు, అరెల్లి మధు పాల్గొన్నారు.

## ఏరివేత ఎప్పుడు?




- బోగస్ పింఛన్లతో అర్హులకు అన్యాయం
- అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న లబ్ధిదారులు
- ఆసరా పింఛన్లలో అవకతవకలు

**ప్రజానావ, భూపాలపల్లి:** ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఇప్పటివరకు వేలాది మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నా ప్రభుత్వం బోగస్ పింఛన్ల ఏరివేత కార్యక్రమం కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో అర్హులైన పింఛన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాలను విచారణ చేస్తే పెద్దఎత్తున అక్రమాలు, అనర్హులు బయటపడుతారని విశ్లేషకులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేయూత పింఛన్ ద్వారా 45 లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. ఇందులో 5లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన పింఛన్లలో ఎక్కువగా అనర్హులు ఉన్నట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఉపాధి హామీ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న వారు ఇలా రకరకాలుగా ఉద్యోగులు చేయూత పింఛను పొందుతున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. బోగస్ పింఛన్ల వల్ల ప్రభుత్వానికి భారీగా ఆర్థిక భారం పెరుగుతుందని,పింఛన్ల జాబితా నుండి అనర్హులను తొలగించి అర్హులైన అందరికీ పింఛన్లు మంజూరు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## సోలార్ ప్రాజెక్టుకు స్థల సేకరణ

**ప్రజానావ, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని దాచారం గ్రామంలో గురువారం శ్రీ శక్తి సోలార్ ప్రాజెక్టుపై మండల అభివృద్ధి మేనేజర్ దొగ్గల ఉదయ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోలార్ మండల అభివృద్ధి మేనేజర్ మాట్లాడుతూ సబ్ స్టేషన్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సాగు భూమిని శ్రీ శక్తి సోలార్ కంపెనీకి లీజుకు ఇస్తే కంపెనీ ఎకరానికి రూ.33వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. అంతేకాకుండా ఏడాదికోసారి కౌలు పెంచే అవకాశం కూడా ఉందని, ఆ పొలం యజమానికి ఆ పొలాన్ని గమనించుకొని ఉన్నట్లయితే నెలకు కొంత జీతంగా చెల్లిస్తామని చెప్పారు. ఆ యజమాని కొడుకులు, కూతుర్లు చదువుకొని ఉంటే వారికి ఆ కంపెనీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా ఇస్తామని తెలిపారు. అయితే ఒక్కసారి అగ్రిమెంట్ చేసుకుంటే 25ఏళ్ల వరకు శ్రీ శక్తి సోలార్ కంపెనీ వారికి అప్పగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బెజ్జంకి, గుగ్గిళ్ల, వడ్లూర్, బేగంపేట్, దాచారం, తోటపల్లి, రేగులపల్లి, కల్లేపల్లి గ్రామాలకు చెందిన రైతులు భూమిని ఇవ్వాలనుకుంటే 7207201437, 7416921063 గల ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఉదయ్ కుమార్ సూచించారు.




## ధ్యాన నిష్టాశ్రమం వార్షికోత్సవం

### దయానంద స్వామి వారి 104వ జయంతి



**ప్రజానావ, బెజ్జంకి:** మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామంలో గల శ్రీ ధ్యాన నిష్టాశ్రమంలో గురువారం 66వ వార్షికోత్సవం మరియు దయానంద స్వామి వారి 104వ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారి శ్వేత శిలా విగ్రహానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతి మాఘ పాడ్యమి రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం ఉపనిషత్ సామూహిక పారాయణం నిర్వహించారు. కోరుట్ల నుంచి విచ్చేసిన జగదీశ్వరానంద స్వామి, శుద్ధ బ్రహ్మానంద స్వామి ప్రవచనాలు అందించారు. ఆ తర్వాత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యాననిష్టాశ్రమా ట్రస్ట్ చైర్మన్ అన్నాడి శ్రీనివాసరెడ్డి, ట్రస్టు సభ్యులు సభ్యులు పులి శ్రీనివాస్, కాచం వెంకటేశం, అన్నాడి రాంరెడ్డి, అన్నాడి తిరుపతిరెడ్డి, అరుకొంతం మల్లారెడ్డి, దోరగొల్ల అరేటి తదితరులు పాల్గొన్నారు.


## పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత



**ప్రజానావ, ములుగు:** ములుగు జిల్లాలోని మేడారం మినీ జాతరకు శ్రీలంక నుంచి వనదేవతల దర్శనానికి వచ్చిన పద్మ కుమారస్వామి దంపతుల బ్యాగ్ కనిపించకుండా పోయింది. అందులో విలువైన వస్తువులతో పాటు పాస్ పోర్టు ఉన్నాయని సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న సీసీఎస్ పోలీసు సిబ్బంది రాజ్ కుమార్, మధు, నాగరాజులకు చెప్పగా వారు వెంటనే బ్యాగ్ ని చాకచక్యంగా వెతికి బాధితులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అప్పగించారు. తక్కువ సమయంలో బ్యాగ్ ని వెతికి అప్పగించినందుకు బాధితుల కుటుంబ సభ్యులు పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ హయాంలో ఏడాదిలో 55వేల ఉద్యోగాలు

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజానావ, వేములవాడ:** రానున్న కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ఆది శ్రీనివాస్ తో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు. పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాది కాలంలో జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే డీఎస్సీ వేశామని గుర్తుచేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 55వేల ఉద్యోగాలు ఇవ్వలేదని.. కానీ కాంగ్రెస్ వచ్చాక పది నెలల్లో 55వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోగానే రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయని.. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రతి పట్టభద్రుని దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల పట్టభద్రులు సానుకూలంగా ఉన్నారని.. పట్టభద్రుల సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పరిష్కారమవుతాయన్నారు.

## దత్తత ఉత్తర్వులు



**ప్రజానావ, కరీంనగర్:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహ నుంచి పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం కలెక్టరేట్‌లో దత్తత ఉత్తర్వులు అందజేశారు. శిశు గృహం నుంచి ఐదుగురు మగ శిశువులు, నలుగురు ఆడ శిశువులను వరంగల్, సిద్దిపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, నల్గొండ జిల్లాలకు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. వీరందరికీ కలెక్టర్ పమేలా సత్పతి దత్తత ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని, ఇందుకోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం భగత్ నగర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఆరోగ్యమే మహా భాగ్యం



**ప్రజానావ, కరీంనగర్:** పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే లక్ష్యంగా నగరపాలక సంస్థ చర్యలు తీస్కోవడం జరుగుతుందని అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతిలో జిల్లా క్షయ నివారణ శాఖ, మెప్మా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపట్టిన – నిక్షయ్ శివీర్ అనే పథకంలో భాగంగా దాదాపు 1000 మంది కార్మికులకు వైద్య శిబిరం ద్వారా వైద్యులు పరీక్షలు చేశారు. ప్రధానంగా టీబి వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, టీబీ స్క్రీనింగ్, తెమడ, యూరిన్ తదితర పరీక్షలు చేసి శాంపిల్స్ ను ల్యాబ్‌లకు తరలించారు. వచ్చిన రిపోర్టుల ప్రకారం వైద్యం అందించనున్నారు. అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా టీబీ పరీక్షలు చేయించామని తెలిపారు.

## పేద ఆర్యవైశ్య పిల్లలకు వైద్య సేవలు



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలోని కార్తీక పిల్లల హాస్పిటల్ వైద్యుడు నీరుమల్ల అరవింద్ తండ్రి లేని, నిరుపేద వైశ్య పిల్లలకు 12ఏళ్ల వరకు ఉచితంగా ఓపీ కన్సల్టేషన్, పరిమితమైన మందులు అందించనున్నారు. సహృదయంతో నిరుపేద ఆర్యవైశ్య పిల్లలకు కోసం వైద్యులు అరవింద్ ముందుకు రావడం గొప్ప విషయమని ఆర్యవైశ్య నేతలు ఆయన సేవలను కొనియాడారు. ఈ మేరకు వైద్యులు అరవింద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జగదీశ్, సుద్దాల వెంకటేశ్, పాత రాధా కిషన్, వేణుగోపాల్, రావికంటి భాగ్యలక్ష్మి, కొంజర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఆలయ అర్చకులకు రక్షణ కల్పించాలి



**ప్రజానావ, వేములవాడ:** రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్ దాడి కలకలం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు, ఆలయ యూనియన్ సభ్యులు గురువారం ప్రధాన అర్చక ఈశ్వరిగారి సురేశ్, ఉప ప్రధాన అర్చక ఆలయ యూనియన్ ఉపాధ్యక్షులు చంద్రగిరి శరత్, గోపన్నగారి చందు ఈ దాడిని ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని, ఆలయ అర్చకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీధర్, అర్చక స్వాములు, ఏఈఓ శ్రావణ్, ఆలయ పర్యవేక్షకుడు వరి నరసయ్య, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ఉన్నారు.



## కత్తిగూడెం, రాజుపేట ఇసుక క్వారీల తనిఖీ

**ప్రజానావ, మంగపేట:** ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశించారు. గురువారం ములుగు జిల్లాలోని మంగపేట మండలం రాజుపేట, కత్తిగూడెం ఇసుక క్వారీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్వారీలో గల ఇసుక నిల్వలపై ఆరా తీసి, క్వారీ ఆఫీసులో ఉన్న రికార్డులను పరిశీలించారు. క్వారీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని అన్ని క్వారీలతో పాటు ఇసుక తవ్వకం జరిపే అవకాశం ఉన్న నదులు, వాగుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏటూరునాగారం సీఐ ఏ. శ్రీనివాస్, మంగపేట ఎస్ఐ టీవీఆర్ సూరి, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా శివరాత్రి ఏర్పాట్లు



### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ప్రజానావ, వేములవాడ:** మహా శివరాత్రి జాతర సందర్భంగా ప్రధాన ఆలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలు, ఆలయంలోకి వచ్చి వెళ్లే దారులు, క్యూ లైన్లు, కళ్యాణ కట్ట, ధర్మ గుండం, ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పోలీస్, ఆలయ అధికారులతో కలసి ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా జాతర ఏర్పాట్లను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాల పార్కింగ్ నిమిత్తం గతేడాది కంటే ఎక్కువ పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రదేశాల్లో విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్, మంచి నీటి సదుపాయలు కల్పించాలన్నారు. పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ డైవర్షన్ల వద్ద సూచిక బోర్డ్స్,ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతతో పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఈఓ వినోద్, ఆలయ ఈఈ రాజేష్, డీఈ మహిపాల్ రెడ్డి, ఏఈఓ శ్రవణ్ కుమార్, ఏఈ రామ్ కిషన్ రావు, ఎస్ఐలు ప్రేమనందం, రాజు, సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ల అవకతవకలు

### ఔట్ సోర్సింగ్స్, పీర్వోల చేతివాటం

### సీబీసీఐడీకి ఫిర్యాదు చేస్తాం : ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



**ప్రజానావ, కరీంనగర్:** సదరం సర్టిఫికెట్ల అవకతవకలపై సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మేం చేసే పనులకు మాత్రం ఏ లెక్క లేదు అన్న చందంగా జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ (డీఆర్డీఏ) అధికారులు సంబంధిత సూపరింటెండెంట్ వ్యవహరిస్తున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లలో లక్షల రూపాయల కుంభకోణంపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని తాము మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు. అధికారులందరూ లక్షల రూపాయలను పప్పుబెల్లంలా పంచు కున్నారని, పాత్రధారులు, సూత్రధారులు అందరూ ఆ శాఖలోనే ఉన్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం సదరం క్యాంపు 200 మందికి మాత్రమే స్లాట్ బుకింగ్ విధానం ఉంటుందని, కానీ దానికి భిన్నంగా హుజూరాబాద్‌లో సదరం క్యాంపు ఆకస్మికంగా నిర్వహించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అడిషనల్ డీఆర్డీఓ వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన విచారణ కమిటీ గత ఏడాది జనవరి 2021 నుంచి 2022 ఫిబ్రవరి వరకు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించిందని, కానీ హుజూరాబాద్‌లో జరిగిన సదరం సర్టిఫికెట్లపై విచారణ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేట్లు లక్షల రూపాయలు వసూలు చేశారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి వెనుక ఉన్న పాత్రదారులు, సూత్రదారులను బయటకు లాగాలన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

## హిమాచల్‌లో సిరిసిల్ల విద్యార్థి ప్రతిభ



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రొ. జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, బాబు జగ్జీవన్ రామ్ అగ్రికల్చర్ కాలేజీ, సిరిసిల్లలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న రమావత్ ఛత్రపతి ఇటీవల హిమాచల్ ప్రదేశ్ నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ - నేషనల్ అడ్వెంచర్ క్యాంప్-2024లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన రాక్ క్లైబింగ్, రాపెల్లింగ్, రివర్ క్రాసింగ్, ట్రెక్కింగ్, మౌంటైన్ రెస్క్యూ మెథడ్స్ సోషల్ అవేర్నెస్, క్యాంపింగ్‌లను విజయవంతంగా పూర్తి చేశాడు. అంతేకాకుండా 80కి.మీ ట్రెక్కింగ్ చేసి 10,000 అడుగుల ఎత్తుని సాదించాడు. ఇందులో భాగంగా హిమాచల్ రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ సర్టిఫికెట్‌తో సత్కరించింది. దీంతో పాటు విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, కళాశాల అసోసియేట్ డీన్, శ్రీదేవి అభినందించారు.


## రెండో రోజు కొనసాగిన స్పెషల్ డ్రైవ్

### 71కి చేరుకున్న కేసుల సంఖ్య

## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**ప్రజానావ, హైదరాబాద్:** అక్రమ ఇసుక రవాణా అరికట్టడంలో రాచకొండ పోలీసులు మరోసారి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేపట్టే వారిపై రాచకొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత కొన్ని రోజులుగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా మీద పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఈ క్రమంలో రెండో రోజు కొనసాగిన స్పెషల్ డ్రైవ్ తో నమోదయిన కేసుల సంఖ్య 71 కి చేరుకుంది. ఎల్బీనగర్ జోన్ %-% 26 కేసులు, మల్కాజిగిరి జోన్ %-% 23 కేసులు, యాదాద్రి- భువనగిరి జోన్ %-% 10 కేసులు, మహేశ్వరం జోన్ - 12 కేసులు ఇలా నాలుగు జోన్లలో మొత్తం 107 మంది నిందితుల మీద 71 కేసులు నమోదు చేశారు. అలాగే 44 ఇసుక డంపుల్లోని 58 లక్షల 72 వేల రూపాయల విలువైన 3762టన్నుల ఇసుకను సీజ్ చేసి 9 లారీలు, 5 టిప్పర్లు, ఒక మినీ వ్యాన్ మరియు 8 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.





# బుమ్రా ఆడతాడని భారీ ఆశలే పెట్టుకొన్నాం

## ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్

**అహ్మదాబాద్:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ చివరి వన్డే సిరీస్‌ను ఘనంగా ముగించింది. ఇంగ్లండ్‌పై మూడు వన్డేల సిరీస్‌ను 3–0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లేకుండానే మెగా టోర్నీలో ఆడేందుకు సిద్ధమవుతోంది. వెన్ను నొప్పికి సంబంధించి స్కానింగ్‌లు బాగానే ఉన్నప్పటికీ.. అతడు పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయడం కష్టమేనన్న ఉద్దేశంతో విశ్రాంతి ఇవ్వడానికే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపింది. ఈ విషయంపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. ఇంగ్లండ్‌తో మూడో వన్డే అనంతరం క్రీడా ఛానల్‌తో మాట్లాడాడు. "జస్‌ప్రీత్ బుమ్రా వంటి పేసర్ జట్టులో ఉండాలని ఎవరైనా కోరుకుంటారు. మేం కూడా అతడు ఆడతాడనే ఆశాభావంతోనే ఉన్నాం. కానీ, అన్నీ మన చేతుల్లో ఉండవు. అతడు ప్రపంచస్థాయి క్లాసిక్ ప్లేయర్. భవిష్యత్తులో మరిన్ని కీలక మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం ఉంది. అందుకే, అతడికి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించాం. అంతకుమించి ఇతర విషయాలను వెల్లడించం. అయితే, బుమ్రా గైర్హాజరీతో యువ పేసర్లకు మంచి అవకాశం దొరికింది. హర్షిత్, అర్ష్‌దీప్ సింగ్ నుంచి నాణ్యమైన ప్రదర్శన వస్తుందని భావిస్తున్నా. దేశం కోసం తమవంతు బాధ్యత తీసుకోవాలి. ఐసీసీ టోర్నీలో ఆడే అవకాశం రావడం సులువేం కాదు. ఇంగ్లండ్‌పై హర్షిత్ అద్భుతంగా ఆడాడు. కీలకమైన వికెట్లు తీసి సత్తా చాటాడు. షమీ వంటి సీనియర్ పేసర్ జట్టులో ఉన్నాడు. కుర్రాళ్లకు మార్గనిర్దేశం చేస్తాడు. ఇది జట్టుకు అదనపు ప్రయోజనం" అని గంభీర్ వెల్లడించాడు.

# బుమ్రా ప్లేస్ భర్తీ కష్టమే..

## పాత బంతితో హర్షిత్ ప్రమాదకరమే : పార్థివ్ పటేల్



ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనే వన్డేల్లోకి అరంగేట్రం చేసిన యువ బౌలర్ హర్షిత్ రాణా మెరుగైన ప్రదర్శనే ఇచ్చాడు. దీంతో బుమ్రా గైర్హాజరీలో ఛాంపియన్స్ ట్రోఫీ స్క్వాడ్‌లోనూ హర్షిత్‌కు అవకాశం దక్కింది. సీనియర్ పేసర్ మహ్మద్ షమీతో కలిసి కొత్త బంతిని పంచుకోవాల్సి ఉంది. అయితే, అతడు పాత బంతితో ప్రమాదకరంగా అనిపిస్తాడని.. మొదటి స్పెల్‌లో భారీగా పరుగులు ఇస్తున్నట్లు భారత మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వెల్లడించాడు. అలాగే బుమ్రా ప్లేస్‌ను భర్తీ చేయడం తేలికైన విషయం కాదని స్పష్టం చేశాడు. "కొత్త బంతితో హర్షిత్ బాగా పరుగులు ఇస్తున్నాడు. ఓపెనింగ్ స్పెల్‌లో కాస్త భిన్నమైన బౌలర్‌గా కనిపిస్తున్నాడు. అతడు స్వింగ్ బౌలర్ కాదు. పిచ్‌పై బలంగా బంతిని విసిరే బౌలర్. అందుకే, బంతి పాతబడిన తర్వాత వికెట్లు తీయడం అతడికి సులువైంది. హార్దిక్ పాండ్యతో మొదటి వన్డేలో కొత్త బంతితోనే బౌలింగ్ చేయించారు. ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే చేస్తారా? అంటే చెప్పలేం. రెండు లేదా మూడు ఓవర్లు నాణ్యంగా వేస్తేనే అతడిని కొనసాగించే అవకాశం ఉంది. బుమ్రా ప్లేస్‌ను రాణాతో భర్తీ చేయడం చాలా కష్టమే. కొత్త బంతితో అతడు ఎక్కువగా వికెట్లు తీయలేదు. అయితే, ఈ విభాగంలో కాస్త మెరుగైతే మాత్రం ఛాంపియన్స్ ట్రోఫీలో హర్షిత్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు కష్టమే" అని పార్థివ్ తెలిపాడు.



# ఆర్సీబీ కొత్త సారథిగా రజత్ పటీదార్

**బెంగళూరు:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కొత్త సారథి వచ్చాడు. యువ బ్యాటర్ రజత్ పటీదార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టింది. గత సీజన్‌లో ఆర్సీబీని నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్‌ను ఈసారి రిటైన్ చేసుకోలేదు. అలాగే మెగా వేలంలో దక్కించుకోలేదు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ జట్టులో ఉన్నప్పటికీ.. కెప్టెన్సీ వైపు మొగ్గు చూపలేదు. మరో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌తోపాటు కృనాల్ పాండ్య కూడా ఈ రేసులో నిలిచారు. అయితే, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రజత్‌కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. 31 ఏళ్ల రజత్ పటీదార్ భారత్ తరఫున గతేడాదే టెస్టుల్లోకి అరంగేట్రం చేయగా.. 2023లో వన్డేల్లోకి వచ్చాడు. టీమ్ఇండియాకు కేవలం మూడు టెస్టులు, ఒకే ఒక్క వన్డే మాత్రమే ఆడాడు. ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20లు ఆడిన అనుభవం అతడికి లేకపోవడం గమనార్హం. ఐపీఎల్‌లో 2021లోకి అడుగుపెట్టిన రజత్ ఇప్పటి వరకు 27 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 34.74 సగటుతో 799 పరుగులు చేశాడు. గత ఐపీఎల్ మెగా వేలానికి ముందు ఆర్సీబీ రిటైన్ చేసుకున్న జాబితాలో ఉన్నాడు. అతడిని రూ. 11 కోట్లకు ఆర్సీబీ అట్టిపెట్టుకుంది.

### కోహ్లీ స్పందన..


ఆర్సీబీ సారథిగా నియమితులైన రజత్ పటీదార్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అభినందనలు తెలిపాడు. ఈ మేరకు ఆర్సీబీ ఓ వీడియోను పోస్టు చేసింది. 'నాతో పాటు జట్టులోని ప్రతి ఒక్కరూ నీ వెనుకే ఉంటాం. జట్టులో నువ్వు ఎదిగిన తీరు అద్భుతం. ఆర్సీబీ అభిమానుల్లో నీకంటూ ప్రత్యేక స్థానం ఉంది. ఈ బాధ్యతలకు నువ్వు అర్హుడివి" అని కోహ్లీ వెల్లడించాడు.



# ఆ ప్లాన్స్ ఇక్కడ చెప్పలేం.. అదే ఫాలో అవుతాం

**- రోహిత్ శర్మ**

**ముంబై:** ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం సంతోషంగా ఉందని భారత సారథి రోహిత్ శర్మ తెలిపాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట జట్టులోని ప్రతిఒక్కరూ ఫామ్ అందుకున్నట్లు వెల్లడించాడు. యువ క్రికెటర్లూ తమ బాధ్యతలను స్వీకరించేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ లో అమలుచేయబోయే ప్లాన్స్ గురించి ఇక్కడ మాట్లాడలేమని.. గత వన్డే ప్రపంచకప్‌లో ఆడిన తీరునే కొనసాగిస్తామని స్పష్టంచేశాడు. "జట్టులో ఇప్పుడు చాలా స్వేచ్ఛ ఉంది. సిరీస్ ఆసాంతం జోరైన ప్రదర్శన చూపించాం. ఇంగ్లండ్ బౌలర్లపై ఆధిపత్యం సాధించాం. గత వన్డే ప్రపంచకప్ మంచి ఉదాహరణ. దానినే కొనసాగిస్తున్నాం. కొన్నిసార్లు మనం అనుకున్నట్లు ఫలితా లు రాకపోవచ్చు. వాటినుంచి పాఠాలు నేర్చుకుంటాం. ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి ప్రణాళికలను ఇప్పుడే, ఇక్కడే వెల్లడించలేను. నిలకడైన ప్రదర్శన చేస్తామని మాత్రం చెబుతా. జట్టులోని ప్రతిఒక్కరూ స్పష్టతతో ఉన్నారు. ఇప్పుడీ సిరీస్‌లో విజయం సాధించినా.. ఇంకా కొన్ని అంశాల్లో మెరుగుకావాల్సి ఉంది. తప్పకుండా వాటిపై దృష్టిసారించి ముందుకుసాగుతాం" అని రోహిత్ తెలిపాడు.



# ఇదేమీ గోల్ఫ్ టూర్ కాదు..

## ఇంగ్లండ్‌పై కెవిన్ పీటర్సన్ ఆగ్రహం

**అహ్మదాబాద్:** భారత పర్యటనలో రెండు సిరీస్‌లను ఇంగ్లండ్ కోల్పోయింది. తొలుత టీ20 సిరీస్‌ను 4–1 తేడాతో చేజార్చుకోగా.. వన్డే సిరీస్‌ను 3–0 తేడాతో కోల్పోయింది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముంగిట తమ జట్టుకు ఎదురైన పరాభవంపై మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ అసహనం వ్యక్తం చేశాడు. తాజాగా మూడో వన్డేలోనూ 142 పరుగుల తేడాతో భారత్ చేతిలో ఇంగ్లండ్‌కు పరాభవం ఎదురైంది. ఈ సందర్భంగా టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి చేసిన 'ప్రాక్టీస్ సెషన్' వ్యాఖ్యలపై పీటర్సన్ స్పందించాడు. కేవలం ఒకేఒక్క ప్రాక్టీస్ సెషన్‌లో ఇంగ్లండ్ పాల్గొందనే వార్తలు వచ్చాయి. "నేను, రవిశాస్త్రి మ్యాచ్ గురించి మాట్లాడుకుంటూ ఉన్నాం. గత వారం కనీసం ఒక్క ప్రాక్టీస్ సెషన్‌లోనూ ఇంగ్లండ్ ప్లేయర్లు పాల్గొనలేదని తెలిసి ఆశ్చర్యపోయా. నాగ్‌పూర్ వేదికగా జరిగిన మొదటి వన్డే ముందు కూడా ప్రాక్టీస్ చేయలేదట. కేవలం జోరూట్ మాత్రమే నెట్స్‌కు వచ్చాడని తెలిసింది. అలాంటప్పుడు భారత పర్యటనకు మీరు రావొద్దు. ఇలా అన్నందుకు క్షమించాలి. ఎందుకంటే ఉపఖండం పిచ్‌లపై ఆడాలంటే సాధన చాలా అవసరం. లేదు మేం ఇలానే పొరపాట్లు చేస్తూ ఉంటాం.. ప్రాక్టీస్ సెషన్‌కు వెళ్లమని అనుకుంటే ఆగిపోండి. క్రీడల్లో మంచి ప్రాక్టీస్ లేకపోతే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం చాలా కష్టం. టీ20 సిరీస్‌ను కోల్పోయినా సరే మెరుగ్గా ఆడాలనే లక్ష్యం లేకపోతే ఎలా?. గోల్ఫ్ ఆడేందుకు ఆసక్తి చూపించిన ప్లేయర్లు క్రికెట్‌ను ప్రాక్టీస్ చేయడంపై దృష్టిసారించలేకపోయారు. మీరు దానిని ఆస్వాదించారు. కానీ, మ్యాచ్‌లు గెలిచేటప్పుడు అవన్నీ చేస్తే బాగుండేది. కానీ, ఓటములను చవిచూస్తూనే ఆడారంటే ఏమనుకోవాలి. ఇదేమీ గోల్ఫ్ టూర్ కాదుగా.. క్రికెట్ పర్యటన కదా. మీరు భారత పిచ్ పరిస్థితులకు మర్యాద ఇవ్వలేదు. ఇక్కడ ఆడటం తేలికైన విషయం కాదు" అని కెవిన్ వ్యాఖ్యానించాడు.



# ఇద్దరు వికెట్ కీపర్లతో ఆడలేం.. అతడే నంబర్ వన్ : గంభీర్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 4–1తో, వన్డే సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసి టీమ్ఇండియా జోష్ మీదుంది. ఇదే ఊపును ఛాంపియన్స్ లోనూ ప్రదర్శించాలనుకుంటోంది. ఈ మెగా టోర్నీ కోసం మరో రెండు రోజుల్లో భారత జట్టు దుబాయ్‌కి వెళ్లనుంది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా తుది జట్టు ఎలా ఉండనుంది? ఎవరికి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కుతుంది? ఎవరు బెంచ్‌కు పరిమితమవుతారనే దానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వికెట్‌కీపర్‌గా యువ ఆటగాడు రిషభ్ పంత్‌ను తీసుకుంటారా? లేదా ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో రాణించిన కేఎల్ రాహుల్‌నే కొనసాగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ క్లారిటీ ఇచ్చాడు. ఈ మెగా టోర్నీలో కేఎల్ రాహులే తమ ఫస్ట్ ఛాయిస్ వికెట్‌కీపర్ అని గంభీర్ తెలిపాడు. 'కేఎల్ రాహుల్ ఇప్పుడు మా నంబర్ వన్ వికెట్ కీపర్. ఇప్పటికైతే ఇదే చెప్పగలను. రిషభ్ పంత్ కు ఏ క్షణంలోనైనా అవకాశం రావచ్చు. కేఎల్ రాహుల్ రాణిస్తున్నాడు. అయితే, జట్టులో ఇద్దరు నాణ్యమైన వికెట్‌కీపర్‌లు ఉంటే ఒకే మ్యాచ్‌లో ఇద్దరిని ఆడించలేం. ఇక రాహుల్‌ని ఐదో స్థానంలోనే ఆడిస్తారా? అంటే అది కూడా స్పష్టంగా చెప్పలేం. ఏ ప్లేయర్ అయినా ఐదో స్థానంలో ఆడొచ్చు. ఆటగాడి కన్నా జట్టు ప్రయోజనాలే ముఖ్యం. ఆ సమయంలో సగటు, రికార్డులు చూడం. ఏ ఆటగాడు బాగా రాణించగలడో మాత్రమే చూస్తాం' అని గంభీర్ పేర్కొన్నాడు.



# స్టార్క్ ఔట్

**సిడ్నీ:** చాంపియన్స్ ట్రోఫీ ఎదుట ఆస్ట్రేలియాకు మరో ఎదురుదెబ్బ. ఇప్పటికే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ నుంచి ఆసీస్ పేస్ వీరులు జోష్ హెజిల్‌వుడ్, పాట్ కమిన్స్, ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ గాయాల కారణంగా తప్పుకోగా మార్కస్ స్టోయినిస్ రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా ఆ జట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సైతం టోర్నీకి దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాలతో అతడు తప్పుకున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా బుధవారం తెలిపింది. కాగా చాంపియన్స్ ట్రోఫీలో ఆసీస్‌కు స్టీవ్ స్మిత్ సారథిగా వ్యవహరించనున్నాడు.

# ఫ్యామిలీలు లేకుండానే చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా క్రికెటర్లు



**న్యూఢిల్లీ:** బీసీసీఐ కొత్తగా ప్రవేశపెట్టిన ట్రావెల్ పాలసీ అమలులోకి రానున్నది. చాంపియన్స్ ట్రోఫీతో ఆ రూల్‌ను అమలు పరచనున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన ఇండియా జట్టు దుబాయ్ వెళ్లనున్నది. అయితే టీమిండియా ప్లేయర్లతో కుటుంబాలు వెళ్లేందుకు అనుమతించలేదు. ఫిబ్రవరి 20వ తేదీన బంగ్లాదేశ్‌తో ఇండియా తొలి మ్యాచ్ ఆడనున్నది. ఆ తర్వాత 23వ తేదీన పాకిస్థాన్‌తో తలపడనున్నది. మార్చి 2వ తేదీన కివీస్‌తో మ్యాచ్ ఉంటుంది. రోహిత్ నేతృత్వంలోని భారత జట్టు దుబాయ్‌లో మ్యాచ్‌లు ఆడనున్నది. కానీ టోర్నీకి చెందిన మిగితా మ్యాచ్‌లు అన్నీ పాకిస్థాన్‌లో జరగనున్నాయి. టోర్నమెంట్ డ్యూరేషన్ కేవలం మూడు వారాలు మాత్రమే ఉండడం వల్ల .. ప్లేయర్లతో ఫ్యామిలీ వెళ్లేందుకు బీసీసీఐ అనుమతించడం లేదు. కొత్త పాలసీ ప్రకారం ఒకవేళ విదేశీ టూర్ 45 రోజులు ఉంటే, దాంట్లో రెండు వారాల పాటు ప్లేయర్లతో ఉండేందుకు కుటుంబసభ్యులకు అనుమతి కల్పిస్తారు. ఒకవేళ టూర్ షెడ్యూల్‌లో ఏదైనా మార్పు జరిగితే, అప్పుడు పరిస్థితి మరోలా ఉంటుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ ఆటగాళ్లు తమ భార్యలు కానీ, పిల్లలు, కానీ భాగస్వామ్యుల్ని తీసుకెళ్లాలనుకుంటే బీసీసీఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కొత్త ట్రావెల్ పాలసీ ప్రకారం ఖర్చులు ప్లేయర్లే భరించాల్సి ఉంటుంది. చాంపియన్స్ ట్రోఫీ కోసం వెళ్లే ఆటగాళ్లు మళ్లీ నెల రోజుల్లోనే తిరిగి రానున్న నేపథ్యంలో.. ప్లేయర్లతో కుటుంబీకులు వెళ్లే ఛాన్సు లేదని బీసీసీఐ చెప్పింది. ఒకవేళ విజిటర్స్ సమయం దాటితే, అప్పుడు అయ్యే ఖర్చులతో బీసీసీకి సంబంధం ఉండదు. ఇక జూలై–ఆగస్టులో ఇంగ్లండ్‌లో జరిగే అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం వెళ్లే ప్లేయర్లతో ఫ్యామిలీ సభ్యుల్ని అనుమతించనున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది. రెండు వారాల పాటు కుటుంబీకులకు క్రికెటర్లతో స్టే చేసే అవకాశం కల్పించనున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత జట్టు దారుణంగా విఫలం కావడంతో.. కొత్త ట్రావెల్ పాలసీని రూపొందించారు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్ల మధ్య సమన్వయం, క్రమశిక్షణ లోపించినట్లు గుర్తించారు.

# శ్రేయస్ ఆట బాగుంది: బంగర్



**ముంబై:** "గతంలో శ్రేయస్ అయ్యర్ షార్ట్ పిచ్ బంతిని ఆడటంలో ఇబ్బంది పడ్డాడు. ఇటీవల మాత్రం ప్రతి బంతిని సరిగ్గా అంచనా వేసి ఆడేందుకు ప్రయత్నిస్తున్నాడు. అలాంటి బంతి విసిరినప్పుడు కాస్త వెనక్కి వెళ్లి ఆఫ్‌సైడ్ దిశగా కొట్టిన తీరు అద్భుతం. ఏ బంతినీ వదిలేద్దామని భావించలేదు. గతంలో చేసిన పొరపాట్లను చేయకుండా ఆడాడు. షార్ట్ పిచ్ బంతి వచ్చినప్పుడు లెగ్‌సైడ్ అడుగు వేయకుండా క్రీజ్‌లోనే కాస్త వెనక్కి వెళ్లి ఆడేశాడు. అతడి గేమ్ చాలా బాగుంది. అతడి బాడీ లాంగ్వేజ్ కూడా గతంతో పోలిస్తే మెరుగ్గా అనిపించింది" అని భారత మాజీ కోచ్ సంజయ్ బంగర్ వ్యాఖ్యానించాడు.

# ప్రభాస్ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు




ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ భాగమయ్యారు. ఈవిషయాన్ని తెలియజేస్తూ తాజాగా ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "ఇండియన్ చిత్ర పరిశ్రమకు బాహుబలిగా పేరుపొందిన ప్రభాస్‌తో కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై టాలెంటెడ్ హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన కథ.. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి ఫ్రెండ్స్" అని ఆయన రాసుకొచ్చారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. "మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకూ ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళుతుంది. 'సీతారామం' తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు" అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హను రాఘవపూడి తెలిపారు. ప్రభాస్‌కు జంటగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. ఇమాన్వీని ఈ సినిమాలోకి ఎంచుకోవడంపై హను గతంలో మాట్లాడారు. "ఇమాన్వీ అందం, ప్రతిభ కలిగిన అమ్మాయి. అందరిలాగానే నేనూ ఆమె డ్యాన్స్ వీడియోలు చూస్తుంటా. ఆమె మంచి భరతనాట్యం డ్యాన్సర్. కళ్లతోనే ఎన్నో హావభావాలను పలికిస్తుంటుంది. అందుకే ఆమెకు ఒక అవకాశం ఇవ్వాలనుకున్నా" అని ఆయన చెప్పారు.

# అలా కానిపక్షంలో ఆ బంధం కొనసాగదు

## భాగస్వామిపై సమంత సందేశాత్మక పోస్ట్

సందేశాత్మక పోస్టులతో పలు విషయాలపై తన అభిప్రాయాలను సోషల్‌మీడియా వేదికగా వ్యక్తపరుస్తున్నారు నటి సమంత. తాజాగా ఆమె జీవిత భాగస్వామిపై ఒక సందేశాత్మక పోస్ట్‌ను పంచుకున్నారు. భాగస్వామిని ఉద్దేశించి జేశెట్టి అనే రచయిత మాట్లాడిన వీడియోను ఆమె ఇన్‌స్టా స్టోరీస్‌లో షేర్ చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ఏ బంధమైనా ముగిసిపోతుందని అందులో పేర్కొన్నారు. "మీరు అద్భుతమైన భాగస్వామితో మంచి బంధాన్ని కలిగిఉండొచ్చు. నిజమైన ప్రేమకు అది అన్నిరకాల సామర్థ్యాన్ని కలిగిఉంటుంది. కానీ, మీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మీరు జాగ్రత్తగా చూసుకోకపోతే.. కోరుకున్నవిధంగా భాగస్వామికి కనిపించలేరు. ఉదాహరణకు ఎదుటి వ్యక్తిలో అంతా చక్కగా ఉందని మనం అనుకుంటాం. కానీ, మన మనసు, శరీరం ఎలా ఉందా అనేది మాత్రం గుర్తించం. అలాంటప్పుడు ఏదో సమయంలో ఆ వ్యక్తిని కోల్పోవాల్సిందే" అని అందులోని సారాంశం. ప్రస్తుతం ఇది నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. సమంత ఇటీవల 'సిటడెల్: హనీ బన్నీ' ప్రాజెక్టుతో అలరించారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రాజెక్టులో వరుణ్ ధావన్, సమంత జంటగా నటించారు. 80-90ల కాలంలో సమాజంలో మహిళల పరిస్థితి ఏంటనేది అందులో చూపించారు. హనీ పాత్రలో సమంత మెప్పించారు. కుమార్తె నదియాను రక్షించుకొనే తల్లి పాత్రలో కన్పించారు. స్వీయ నిర్మాణంలో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను కొన్ని నెలల క్రితం అనౌన్స్ చేశారు. దీంతోపాటు 'రక్త్ బ్రహ్మాండ్' అనే సిరీస్‌లోనూ నటిస్తోంది. మరోవైపు, సమంత ప్రస్తుతం ముంబయిలో ఉన్నారు. శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని ఆమె సందర్శించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు.







# 'కన్నప్ప'.. ప్రభాస్, మోహన్‌లాల్ పారితోషికం ఎంతంటే!

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. వేసవి కానుకగా ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో ఇండస్ట్రీలోని అగ్రనటీనటులు కీలక పాత్రలు పోషించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఏడు సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.140 కోట్లతో ఇది ముస్తాబవుతున్నట్లు చెప్పారు. "ఈ సినిమాలో శివుడి పాత్రలో బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన్ని సంప్రదించినప్పుడు రెండుసార్లు తిరస్కరించారు. తర్వాత వేరే దర్శకుడితో చెప్పించి ఆయన్ని ఒప్పించాం. శివుడి పాత్రకు అక్షయ్ వందశాతం న్యాయం చేశారు. 'ఈ తరానికి మీరే శివుడు' అని అక్షయ్‌తో చెప్పాను. ఇక ఈ చిత్రంలో ప్రభాస్ , మోహన్‌లాల్ కూడా కీలకపాత్రలు పోషించారు. వాళ్లకు ఈ కథ చెప్పగానే అంగీకరించారు. షూటింగ్ ఎప్పుడు ప్రారంభిస్తారని అడిగారు. ఈ సినిమా కోసం వాళ్లిద్దరూ ఒక్క రూపాయి పారితోషికం కూడా తీసుకోలేదు. మోహన్‌బాబు మీద ఉన్న అభిమానంతో ఇందులో నటించారు. మోహన్‌లాల్ దగ్గరకు వెళ్లినప్పుడు పారితోషికం గురించి మీ మేనేజర్‌తో మాట్లాడమంటారా అని అడిగాను. ఆయన నవ్వుతూ.. 'నువ్వు అంత పెద్ద వాడివయ్యావా' అని అన్నారు. ఇక ప్రభాస్ వల్ల నాకు స్నేహంపై నమ్మకం పెరిగింది" అని చెప్పారు.
మహాకవి ధూర్జటి రాసిన శ్రీకాళహస్తీశ్వర మహత్యంలోని భక్త కన్నప్ప చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని 'కన్నప్ప' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మహాభారత' సిరీస్‌ని రూపొందించిన ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మాతగా వ్యవహరిస్తుండగా ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విష్ణు తనయుడు అవ్రామ్ ఈ చిత్రంతో తెరంగేట్రం చేయనున్నాడు. ప్రభాస్ రుద్ర పాత్రలో, కాజల్ పార్వతీదేవి పాత్రలో కనిపించనున్నారు. మోహన్‌లాల్ , శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.

# జర్నలిస్టుపై దాడి కేసు..

## సుప్రీంకోర్టులో నటుడు మోహన్‌బాబుకు ఊరట



నటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టుపై దాడి కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు తాజాగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది డిసెంబరు 10న జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ప్రాంగణంలో.. ఆయనను ప్రశ్నించిన ఒక టీవీ ఛానల్ విలేకరి చేతిలోని మైకు లాక్కొని అతడిపై దాడి చేశారంటూ ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు గత ఏడాది డిసెంబరు 23న కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గాయపడిన జర్నలిస్టుని ఆస్పత్రికి వెళ్లి మోహన్‌బాబు పరామర్శించారని విచారణ సందర్భంగా మోహన్‌బాబు తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విలేకరికి అవసరమైన ఆర్థిక సాయం కూడా చేస్తామని ఇప్పటికే ప్రకటించినట్టు కోర్టుకు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ లేకుండా చేసి, ఇంటికి వచ్చిన వారిపై దాడి చేశారని.. విచారణకు కూడా వెళ్లలేదు కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ విధంగా వ్యవహరించలేదని న్యాయవాది తెలిపారు. "ఇది పూర్తిగా ఇక కుటుంబానికి సంబంధించిన విషయం. వారికి రెండు రాష్ట్రాల్లో ఉన్న ఆస్తుల వ్యవహారం. కుమారుడు, తండ్రికి మధ్య ఉన్న కుటుంబ వివాదం తప్ప బయట ప్రపంచానికి ఏమాత్రం సంబంధం లేదు. ఒక యూనివర్సిటీ, విద్యా సంస్థలకు సంబంధించి తప్ప మరేమీ లేదు" అని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గాయపడిన జర్నలిస్టు ఎలా ఉన్నారని ధర్మాసనం అడిగింది. విలేకరి తరఫు న్యాయవాది పరిస్థితిని వివరించారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# అతడు నన్ను ఎంతో వేధించాడు : ఐశ్వర్య రాజేష్



దక్షిణాది చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన తల్లి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని తెలిపింది. చిన్నతనంలోనే తన తండ్రి చనిపోయారని.. దీంతో అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి తమను పెంచిందని.. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. చిన్న వయసులోనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేశానని.. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. లవ్ కంటే కూడా బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే భయం. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలోనూ నేను రిలేషన్ లో ఉన్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించానని.. అతడు తనను ఎంతో వేధించాడని.. అంతకంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశానని.. రిలేషన్ షిప్ లో ఎందుకు ఇలా జరుగుతుందని భయపడ్డానని.. ప్రస్తుతానికి ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

# బ్యాగ్రౌండ్ లేకున్నా... తనదైన శైలిలో సినిమాలు...



ఎలాంటి ఫిల్మ్ బ్యాగ్రౌండ్ లేకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టి సహజ నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస ఆఫర్స్ అందుకుంది. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలోనూ కీలకపాత్ర పోషించింది. ఎలాంటి పాత్రలోనైనా అవలీలగా జీవించే అందమైన హీరోయిన్. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ అంజలి. ఏపీకి చెందిన ఈ అమ్మాయి.. జీవా నటించిన డేర్ సినిమాతో తెరంగేట్రం చేసింది. అంజలి.. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించింది. గ్లామర్ షోలు కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.

# పవన్ కల్యాణ్ నుంచి ఆ లక్షణం నేర్చుకోవాలి - నిధి అగర్వాల్



'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనున్నారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. పవన్‌కల్యాణ్, ప్రభాస్‌లతో వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2022లో విరామం తీసుకోవడానికి కారణాన్ని నిధి వివరించారు. "నేను స్టార్ కిడ్‌ని కాదు. అలాగే నాకు సినిమా నేపథ్యం కూడా లేదు. నేను నటిగా మొదటిస్థానంలో ఉండడమే పెద్ద విషయం. సినిమాల్లో అవకాశాలు రావడమే నాకు విజయంతో సమానం. ఎక్కువ సినిమాలు చేయాలని అందరికీ ఉంటుంది. కానీ, నేను మాత్రం నమ్మకం ఉన్న కథలనే ఎంచుకుంటాను. అలాంటివాటిపై మాత్రమే దృష్టిపెడతాను. నేనేం హీరోను కాదు.. వరుసగా కమర్షియల్ సినిమాలు చేయడానికి. ఒకవేళ నేను వరుస సినిమాలు చేసినా నన్ను అలాంటి స్క్రిప్టులు ఎంచుకున్నందుకు విమర్శిస్తారు. అందుకే గొప్ప కథలను మాత్రమే ఎంచుకుంటున్నాను" అని చెప్పారు. తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడిన నిధి.."హరిహర వీరమల్లు'లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిననిపించింది. అలాగే హారర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. ఆ చిత్ర బృందమంతా ఫన్నీగా ఉంటుంది. సెట్‌లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం" అని అన్నారు. పవన్ కల్యాణ్, ప్రభాస్‌లు తనను ఎంతో ప్రోత్సహించారని నిధి తెలిపారు. "పవన్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా లీనమవుతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. తన సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ఇక ప్రభాస్ ఎప్పుడూ ఫన్నీగా ఉంటారు. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని చెప్పారు.


Printed, Published and Owned by **Adula Thirupathi**, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**